ఇరుకుతో ఇక్కట్లు

పూర్ణామార్కెట్ లోపల మసిలే వీలేదీ?
ఒక తీరు లేకుండా దుకాణాల నిర్వహణ
ఇబ్బంది పడుతున్న కొనుగోలుదారులు

ప్రజల మార్కెట్ అవసరాలను తీరుస్తూ చక్కటి పేరున్న పూర్ణామార్కెట్ ఇరుకు సమస్యతో సతమతమవుతోంది. మార్కెట్ లోపల ఇష్టారీతిన వ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో వినియోగదారులు స్వేచ్ఛగా మార్కెట్‌లో మసలలేక ఇబ్బంది పడుతున్నారు. అలాగే మార్కెట్‌లో పోగయ్యే కాయగూరల రద్దు, చెత్త తరలించే విషయంలో పారిశుధ్య సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు.


పారిశుధ్య కార్మికుడి తోపుడు బండికి తోవ లేకుండా జరిగిన ఆక్రమణలు

జగదాంబ: పూర్ణామార్కెట్‌లో నడక దారిలేక వినియోగదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సుమారు రెండెకరాల విస్తీర్ణం కలిగిన పూర్ణామార్కెట్‌లో ఏబీసీడీ కేటగిరీ కింద 750కి పైగా దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల నుండి వచ్చే కాయగూరల రద్దు, చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు బాబ్‌కట్ వాహనం మార్కెట్ అంతా తిరుగుతూ ఉండాలి. అయితే వ్యాపారులు మార్కెట్‌లో తమకు కేటాయించిన స్థలాన్ని మించి ఆక్రమించుకుని వ్యాపారాలు చేస్తుండడంతో ఆ వాహనం మసిలే అవకాశం లేక పూర్ణామార్కెట్‌లో ఎక్కడి చెత్త అక్కడే నిల్వ ఉండిపోతోంది. దీంతో అది కుళ్లిపోయి దుర్వాసన కూడా వెదజల్లుతోంది.

కొనుగోలుదారుల ఇబ్బందులు..

పూర్ణామార్కెట్‌కు సామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చే వారు కూడా ఇరుకైన ఆ పరిసరాల్లో మసిలే వీలు లేక ఇబ్బంది పడుతున్నారు. కాయగూరల వ్యాపారులు ఇష్టారీతిన తట్టలు, జంగిడీలు తమ దుకాణాల చుట్టూ పరిచేసి వ్యాపారాలు చేసుకోవడం వల్ల ఒక దుకాణానికి మరొక దుకాణానికి తిరిగి సరకులు కొనుగోలు చేసుకునే వెసులుబాటు వినియోగదారులకు ఉండడంలేదు. అలాగే పూర్ణామార్కెట్ బయట కూడా ఇలాంటి పరిస్థితే ఉంది. అక్కడ కూడా వ్యాపారులు నచ్చినట్లు తమ సరుకు సర్దుకుని నడిచే దారి లేకుండా ఇష్టారీతిన వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీనివల్ల ఇక్కడ తరచూ ట్రాఫిక్ రద్దీ ఏర్పడుతుంది.

ఇష్టానుసారంగా దుకాణాల నిర్మాణాలు..

పూర్ణామార్కెట్‌లో వ్యాపారుల కోసం జీవీఎంసీ నాలుగేసి అడుగుల చొప్పున కేటాయిస్తూ దుకాణాలకు అనుమతులు ఇచ్చింది. ఇది ఒకప్పటి మాట. ఇప్పుడు ఆ దుకాణాలు చేతులు మారిపోయాయి. కొందరు తరతరాలుగా వారసత్వం కింద ఆ దుకాణాలను నిర్వహించుకుంటుంటే.. మరి కొందరు ఆ దుకాణాలను డబ్బు అవసరం నిమిత్తం విక్రయించుకున్నారు. ఏదేమైనా జీవీఎంసీ నిబంధనల ప్రకారం నాలుగు అడుగులు ఉండాల్సిన దుకాణాలు ఇప్పుడు ఎనిమిది.. పది అడుగులకు విస్తరించాయి. కొందరు వ్యాపారులు స్వయంగా ఆ మేరకు నిర్మాణాలు కూడా చేసేసుకున్నారు. ఆశీలు మాత్రం అనాది కాలంలో ఎంత చెల్లించేవారో అంతే చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించి దుకాణాల పొడవు, వెడల్పులను బట్టి పన్నులు విధించాలని పలువురు కోరుతున్నారు. లేని పక్షంలో మళ్లీ ఆక్షన్ పెట్టి ప్రక్షాళన చేయాలంటున్నారు.

గ్యాంగ్‌వే దుకాణాలు మరింత దారుణం..

పూర్ణామార్కెట్‌లో గ్యాంగ్‌వే (దుకాణానికి దుకాణానికి మధ్య కింద ఏర్పాటు చేసేవి) దుకాణాల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. **కొన్నేళ్ల క్రితం పూర్ణామార్కెట్‌లో వ్యాపారులకు సరిపడ దుకాణాల కేటాయింపు జరిగిపోయినా మిగిలిపోయిన వ్యాపారులు మొర పెట్టుకుంటే గ్యాంగ్‌వే దుకాణాలకు కొందరు అధికారులు దయతో అనుమతి ఇచ్చారు. అది కూడా పరిమితంగా.. ఎదుటి దుకాణాలకు, వినియోగదారులకు ఇబ్బంది కలగని రీతిలో ఏర్పాటు చేసుకోవాలని అనుమతులు ఇచ్చారు. అయితే రాను** రాను గ్యాంగ్‌వే దుకాణాలు నిర్వహించుకునే వ్యాపారులు నాటి అధికారుల మాటలు బేఖాతరు చేస్తూ ఇష్టారీతిన తట్టలు, జంగిడీలు పరిచేసి వ్యాపారాలు చేసుకుంటూ అందరినీ ఇబ్బందులకు గురి చేస్తున్నారు.


వార్డు కార్యాలయాన్ని ఆక్రమించుకుని అనధికారకంగా ఏర్పాటు చేసిన దుకాణం


పూర్ణామార్కెట్‌లో నిబంధనలు అతిక్రమించి ఏర్పాటు చేసుకున్న దుకాణాలు


దుకాణాల పరిధి దాటి ముందుకు పెట్టిన సామగ్రి

విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం..

పూర్ణామార్కెట్‌లో జీవీఎంసీ ఇచ్చిన దుకాణాలు కాకుండా అనధికారకంగా వ్యాపారులు నిర్మించుకున్న దుకాణాలపై విచారణ జరుపుతాం. ఆయా దుకాణాలకు బయట మార్కెట్‌ను బట్టి అద్దెలు నిర్ణయిస్తాం. అలాగే దుకాణాల పరిధిని దాటి తట్టలు, జంగిడీలు పరిచేసి వ్యాపారాలు జరక్కుండా చూస్తాం. ఎవరి పరిధి మేర వారు సామగ్రి పెట్టుకుని వ్యాపారాలు చేసుకునేలా చర్యలు తీసుకుంటాం. అలాగే గ్యాంగ్‌వే దుకాణాల్లో ఎక్కువ జంగిడీలు ఉంటే తొలగిస్తాం.

– ఎం. మల్లయ్యనాయుడు, జోన్–4 కమిషనర్, సూర్యాబాగ్

28 నుంచి మహా అన్నప్రసాద వితరణ


వివరాలు వెల్లడిస్తున్న ట్రస్ట్ సభ్యులు

అల్లిపురం: ఈ నెల 28వ తేదీ నుంచి మండలకాల **మహా అన్నప్ర**సాద వితరణ కార్యక్రమం చేపడుతు**న్నట్లు శ్రీ హ**రిహరాత్మజ అన్నదాన చారిటబుల్ **ట్రస్ట్ ప్రతినిధు**లు కె.రమణమూర్తి, కె.శ్రీను, కె.అ**ప్పారావు గురు**స్వాములు తెలిపారు. శనివారం **వైర్లెస్ కాలనీ కో**దండ రామాలయం ప్రాంగణంలో **ఏర్పాటు చే**సిన విలేకరుల సమావేశంలో **మాట్లాడారు.** ఆరోజు మధ్యాహ్నం వైర్లెస్ కాలనీలో **గల కోదండ రా**మాలయం ఆవరణలో సప్తమ మం**డలకాల మహా** అన్న ప్రసాద వితరణ కార్యక్రమం **డీఆర్ఎం సౌర**భ్ కుమార్ చేతుల మీదుగా ప్రారం**భించనున్నట్లు** తెలిపారు. స్వాములు, భవానీలు, **శివ మాలధారు**లు అన్న ప్రసాదాన్ని స్వీకరించాలని **కోరారు. ఈ** కార్యక్రమానికి సహకారం అందించా**లని కోరుకు**నే వారు ట్రస్ట్ సభ్యులకు స్వయంగా **విరాళాలు అం**దజేసి తగిన రసీదు పొందాలని కోరారు. ఈ సమావేశంలో ట్రస్ట్ సభ్యులు, కోదండ రామాలయం అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, ఎస్.శ్రీనివాస్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు ప్రారంభం


ప్రత్యేక రథంపై వేంచేసిన గౌరీపరమేశ్వరులు

అల్లిపురం: వేంకటేశ్వరమెట్ట, వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రంథాలయం సభ్యులు బృందావన్ లాడ్జి దరి, పీలా వెంకట చినఅప్పలనాయుడు (చినబాబు) ఇంటి వద్ద అమ్మవారికి పూజలు నిర్వహించారు. రథంపై తోడపెద్దు సేవ గరిడీలతో అమ్మవారికి తోడ్కొని వచ్చారు. కమిటీ సభ్యులు పొలమరశెట్టి వెంకట శ్యామ్‌కుమార్, పొలమరశెట్టి సన్యాసిరాజు (శ్రీను), పీలా చిన వెంకట అప్పలనాయుడు, గ్రామ పెద్దలు, మహిళా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

అంధ బాలికల పాఠశాలలో విద్యార్థులకు పరీక్షలు

మహారాణిపేట: సాగర్‌నగర్–ఎండాడ ఏరియాలో ఉన్న అంధ బాలికల పాఠశాలలో విద్యార్థులకు శనివారం పరీక్షలు నిర్వహించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 48 మంది విద్యార్థులను చిన్న పిల్లల వైద్యులు, దంత వైద్యులు, కంటి పరీక్ష నిపుణులు పరీక్షించి వారికి చికిత్స అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వి. సమత, వైద్యులు డాక్టర్ వి.సంధ్యారాణి, డాక్టర్ సీహెచ్ సౌజన్య, డి.భువనేశ్వరి, ఎ.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలో మహిళా కళాశాల విద్యార్థినుల సత్తా

డాబాగార్డెన్స్: ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహించిన మహిళల అంతర కళాశాలల కబడ్డీ పోటీలో విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు సత్తా చాటారు. పోటీలో తృతీయ స్థానంలో నిలిచిన జట్టును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. మంజుల, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి అభినందించారు. కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు, జట్టుకు మేనేజర్‌గా వ్యవహరించిన పి. మహేష్, అలేఖ్య క్రీడాకారుల కృషిని కొనియాడారు.

ముగిసిన ఎక్సెల్సియార్ యువజనోత్సవాలు


నటుడు అంకిత్‌కు జ్ఞాపిక అందిస్తున్న విద్యార్థులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో జరుగుతున్న ఎక్సెల్సియార్–24 యువజనోత్సవాలు శనివారంతో ముగిశాయి. ముగింపు వేడుకల్లో పలువురు కళాకారులు సందడి చేశారు. 80 కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని దేశీయ నృత్యాలు, ముకాభినయం, లఘు నాటికలు, ఫొటోగ్రఫీ వంటి అంశాల్లో ప్రతిభ చాటారు. మిస్టర్ అండ్ మిస్ ఎక్సెల్సియార్ పోటీ అందరినీ అలరించింది. సాంస్కృతిక పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. క్రాఫ్ట్ బేకింగ్ యూనిట్ వ్యాపారవేత్త కె. నిరుపమ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సృజనాత్మకత, పోటీతత్వం, నాయకత్వ లక్షణాలు పెరగడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. సాయంత్రం జరిగిన వేడుకల్లో విశిష్ట అతిథిగా వర్ధమాన నటుడు అంకిత్ కొయ్యా సందడి చేశారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ టి.భాస్కరసుధ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, సోనీ, హరిణి, వీణ, ప్రమీల, రమణీలత, స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు

అల్లిపురం: బల్లిగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి శనివారం భక్తులు బారులు తీరారు. తెల్లవారు జాము నుంచి స్వామిని దర్శించుకునేందుకు భక్తులు రావటంతో ఆలయం కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి విశేష అభిషేకాలు, భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు, చేపట్టారు.

ఫ్యాన్సీ కొవ్వొత్తుల తయారీలో ఉచిత శిక్షణ


కొవ్వొత్తులతో మహిళలు, బాలలు

డాబాగార్డెన్స్: దీపావళి పండగను పురస్కరించుకుని బాలలు, మహిళలకు ఫ్యాన్సీ కొవ్వొత్తుల తయారీపై బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డు బ్రిడ్జి స్కూల్ ప్రాంగణంలో ఉచిత శిక్షణ నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి నరవ ప్రకాశరావు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు తీరిక సమయంలో స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ పొంది ఆర్థికంగా బలపడాలన్నారు. శిక్షకురాలు లక్ష్మితో పాటు బాలలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సారూ.. ఓసారి ఇటు చూడండి


సోల్జర్ పేటలో పరిస్థితి ఇలా..


డాబాగార్డెన్స్: ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేస్తున్న వార్డుల పర్యటన తూతూ మంత్రంగానే సాగుతోంది. మొక్కుబడిగా వార్డుల పర్యటన చేస్తుండడంతో ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్టు సమస్యలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల పలు వార్డుల్లో ఎమ్మెల్యే స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పర్యటించడం మొదలెట్టారు. అంత వరకూ బాగానే ఉంది. సమస్యలు తెలుసుకుని పరిష్కార దిశగా చర్యలు చేపడితే బాగుండేది. వార్డుల్లో చోటా మోటా నాయకులతో పర్యటించడం.. స్థానికులు సమస్యలు చెప్పుకున్నా అవి పరిష్కారం కాకపోవడంతో వార్డు ప్రజలే గగ్గోలు పెడతున్నారు. పర్యటనలో అధిక సంఖ్యలో జనసేన పార్టీకి చెందిన కనిపిస్తున్నారు. ఎమ్మెల్యే ఇటీవల నియోజకవర్గంలోని పలు వార్డుల్లో పర్యటనలకు శ్రీకారం చుట్టారు. పాతనగరం 39వ వార్డు పరిధి సోల్జర్‌పేటలో రిచర్ట్స్ స్కూల్ ఉంది. ఈ పాఠశాలలో చిన్నపిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. పక్షం రోజుల కిందట డ్రైనేజీ పనుల కోసం తవ్వి వదిలేసారు. దీంతో చిన్న పిల్లలు, రాత్రి వేళల్లో స్థానికులు, మందుబాబులు పడిపోతున్నారు. ఈ విషయాన్ని ఎలాగూ వార్డు కార్పొరేటర్ పట్టించుకోరు.. మీరైనా మాపై దయ చూపండంటూ సోల్జర్‌పేట వాసులు వాపోతున్నారు.

గిరిజన బాంధవుడు దేముడు


దేముడు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

అల్లిపురం: గిరిజనుల హృదయాల్లో నిజమైన దేవుడు చింతపల్లి మాజీ శాసన సభ్యుడు గొడ్డేటి దేముడు అని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. దేముడు 9వ వర్ధంతి సందర్భంగా శనివారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని దేముడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న దేముడును చింతపల్లి నియోజకవర్గం నుంచి పార్టీ పోటీలో నిలిపిందన్నారు. శాసన సభ్యునిగా గెలిచి గిరిజనుల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మన్మథరావు, జీఎస్‌జే అత్యుతరావు, ఎస్కే రెహమాన్, జి.కాసులరెడ్డి, నూనెల సూరిబాబు, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పట్ల ఆందోళన అవసరం లేదు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

మహారాణిపేట: క్యాన్సర్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సకాలంలో గుర్తిస్తే దానిని నివారించడానికి వీలు ఉందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. కేజీహెచ్‌లో రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బంది, డ్వాక్రా మహిళలకు రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కల్పించడం మంచి నిర్ణయమన్నారు. బ్రెస్టు క్యాన్సర్‌ను గుర్తించే మమోగ్రఫీ కేజీహెచ్‌లో అందుబాటులో ఉందని అన్నారు. అనంతరం కేజీహెచ్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సమగ్ర క్యాన్సర్ చికిత్స సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. అధునాతన ఎల్ఐఎన్ఏసీ యంత్రం త్వరలో కేజీహెచ్‌కు రాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు, సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద, రేడియాలజీ హెచ్ వోడీ బుజ్జిబాబు, నాయకులు యజ్ఞ శ్రీ, వై. ప్రభాకర్, రామలక్ష్మి, రూప, మహేంద్ర, వినయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.